క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివకల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బైపాస్ కాలనీలో గల ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా శివ కల్యాణం నిర్వహించారు. వేద పండితుడు అప్పల నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి శివకల్యాణం జరిపించారు. ఏటా శివ కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకుడు ఈ సందర్భంగా తెలిపారు. కల్యాణం వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆస్తి పన్ను చెల్లించిన ఆర్టీసీ



ఆర్టీసీ డీఎం నుంచి ఆస్తి పన్ను వసూలు చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీకి ఏపీఎస్ ఆర్టీసీ చెల్లించవలసిన రూ. 2.40 లక్షల ఆస్తి పన్నును డిపో మేనేజర్ ఈకేఎస్ దుర్గ మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.నారాయణరావుకు చెక్కు రూపంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆర్ఐ మాట్లాడుతూ మున్సిపాలిటీకి బకాయి పడిన ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నును ఆయా శాఖల అధికారులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి హరి పట్నాయక్ ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్షిత పథకం ప్రారంభం



రక్షిత పథకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన రక్షిత పథకాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. గ్రామస్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.3 లక్షలతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భరత్‌చంద్ర ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

- డీఈఓ పగడాలమ్మ



కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

భామిని: విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, పసుకుడి ఎంపీపీ స్కూల్, ఏపీ మోడల్ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. వాతావరణం మారుతున్నందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఇటీవల పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అలాగే స్టూడెంట్ కిట్లు, యూనిఫారాల పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు, ప్రిన్స్‌పాల్ శివ కుమార్, ప్రమీల, హెచ్‌ఎంలు కె. వెంకటరావు, బిడ్డికి ప్రసాదరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



సమావేశంలో మట్లాడుతున్న విక్రాంత్

పాలకొండ : నగర పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. నగర పంచాయతీ సాధారణ కౌన్సిల్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో మౌలిక వసతుల కల్పన కోసం పాలకవర్గం నిత్యం పనిచేయాలని సూచించారు. అధికారులతో సమన్వయం ఏర్పరచుకుని ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు. చైర్మన్ యందవ రాధాకుమారి మాట్లాడుతూ.. తాగునీరు, పారిశుధ్యం మెరుగుపడేందుకు అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. సమావేశంలో కమిషనర్ సర్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్ పిలుపు
- జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ

పార్వతీపురంటౌన్:

డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దామని జిల్లాలో యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్ డే సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలపై బుధవారం జిల్లాకేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్ మీదుగా ఎస్‌బీఐ బ్యాంక్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం, వాటి దుష్ప్రభావాలను గురించి అవగాహన కలిగించినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని, అందుకే దేశభవిష్యత్తును కుంగదీసే మాదకద్రవ్యాలను పకడ్బందీగా అరికడదామని విజ్ఞప్తి చేశారు. మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డా ఒ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ పి.సునీల్ షరోన్, పార్వతీపురం పట్టణ సీఐ పీవీవీఎస్ఎన్. కృష్ణారావు, ఎస్సై బి.రవీంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది, కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్సై పద్మావతి అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని, మాదక ద్రవ్యాల జోలికి పోయి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని హితవు పలికారు.



పార్వతీపురం టౌన్: అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పురవీధుల్లో డ్రగ్ నివారణ దినోత్సవ ర్యాలీ

సీతానగరం: డ్రగ్ రహిత సమాజ స్థాపనకు, ప్రజలు, విద్యార్థులు కృషి చేయాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. అంతర్జాతీయ యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎల్ దాలినాయుడు అధ్యక్షతన బుధవారం అవగాహన సదస్సు అనంతరం పురవీధుల్లో ర్యాలీ జరిగింది.



సీతానగరం: సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై ఎం రాజేష్

సాలూరులో విద్యార్థుల ర్యాలీ



సాలూరు రూరల్: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై వెంకటరమణ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూరల్ ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం ప్రజల ఆరోగ్యంతోపాటు దేశ భవిష్యత్‌ను నాశనం చేస్తుందని అలాంటి మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

మక్కువలో..



మక్కువ: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరసింహమూర్తి

మక్కువ: మత్తు పదార్థాలకు అలవాటుపడి విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై పి.నరసింహమూర్తి హితవు పలికారు. ఈ మేరకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు ఎస్సై నరసింహమూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సాలూరు: పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సాలూరు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పట్టణ, రూరల్ సీఐలు వాసునాయుడు, బాలకృష్ణలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, జాతీయరహదారిపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఎస్ఈబీ ఎస్సై పద్మావతి

అలసత్వం వద్దు..

పాలకొండ రూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య పనుల నిర్వహణలో అలసత్వం తగదని మండల ప్రత్యేకాధికారి అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని అన్నవరం, అంపిలి, గోపాలపురం గ్రామాల్లో పర్యటించి, పారిశుధ్య నిర్వహణపై తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాల పనితీరుపై ఎంపీడీఓ ఎస్.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేపట్టడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై ప్రచారం

భామిని: మండలంలోని బిల్లుమడ, బత్తిలిలో బాలల హక్కులపై బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఎస్‌ఓలు జ్యోతిలక్ష్మి, సబితా పట్నాయక్ సారథ్యంలో జరిగిన ర్యాలీలో కళాజాత బృంద సభ్యులు, చిన్నారులు బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం అంటూ నినాదాలు చేశారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్‌లపై వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సిర్ల జయరాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం సందర్శన

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం సందర్శించారు. వసతి గృహంలో మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం, ఇతర సదుపాయాలపై ఆరాతీశారు. పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి వరకు మాత్రమే విద్యాబోధన ఉందని, ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసేలా చూడాలని ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో ఎమ్మెల్యేను కోరా రు. చందులూరు గ్రామానికి చెందిన సాహసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎం.గణేష్ సమకూర్చిన మూడు కంప్యూటర్లు, ప్రొజెక్టర్, పుస్తకాల ర్యాక్‌ను ఎమ్మె ల్యే చేతుల మీదగా పాఠశాలకు అందజేశారు. ప్రభుత్వం సమకూర్చిన దుప్పట్లు, నోట్ పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రిని విద్యార్థినులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కె.ఈశ్వరరావు, ఎల్.కోట హైస్కూల్ హెచ్‌ఎం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయచంద్రకు ఘనంగా స్వాగతం

సీతానగరం: పార్వతీపురం ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అనంతరం నియోజక వర్గానికి వస్తున్న బోనెల విజయ చంద్రకు లచ్చయ్యపేటవద్ద టీడీపీ మండల నాయకులు, వందలాది మంది కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం ఆయన అమరావతినుంచి నియోజకవర్గానికి వస్తున్నట్లు తెలుసుకున్న మండల నాయకులు ద్విచక్రవాహనాలతో ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వచ్చిన వెంటనే లచ్చయ్యపేట కాలనీలో ఉన్న టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లచ్చయ్యపేట నుంచి వందలాది మోటారుసైకిల్స్‌తో ర్యాలీగా మండలకేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యే విజయచంద్రను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యం, ఆర్. వేణుగోపాలనాయుడు, మండల నాయకులు ఎస్.హరిగోపాలనాయుడు, అరవింద్‌కుమార్, బి.శ్రీనివాసరావు, లచ్చయ్యపేట మాజీ సర్పంచ్ వి గుంపస్వామి, శ్రీరాములు, టి.వెంకటప్పలనాయుడు, ఎస్ శ్రీనివాసరావు, నియోజక వర్గం కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

వెద విత్తనాలు మొలకెత్తడంలో మెలకువలు పాటించాలి



పొలంలో వరి వెద మొలకను పరిశీలిస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: రైతులు వేసిన వెద విత్తనాలు మొలకెత్తి పైరు ఏపుగా పెరగడానికి మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన జోగింపేటలో వెద సాగును పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ జోగింపేట, ఇప్పలవలస, పాపమ్మవలస గ్రామాల్లో రైతులు దాదాపు 450 ఎకరాల వరకు వరిని వెద పద్ధతిలో నేరుగా దుక్కిదున్నే పొలంలో చల్లే పద్ధతిని రైతులు అవలంబిస్తున్నారని తెలియజేశారు. ఒకటి రెండు వర్షపు తడులకు 100 శాతం మొలకలు ఎక్కువగా వస్తాయని ప్రస్తుతానికి 80 శాతం వరకు మొలకలు వచ్చినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించామన్నారు. వరిని వెదపద్ధతిలో వేసిన రైతులు కచ్చితంగా విత్తనాలు పదునులో వేసిన మరుక్షణమే కలుపు విత్తనాలు మొలకెత్తకుండా ఉండడానికి ప్రిటిలా క్లోర్ + సెఫ్నేర్ అనే మందును ఎకరాకి 600 నుంచి 800 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలి. లేదా పైరజో సెల్ఫ్ యురాన్ ఈథైల్ అనే కలుపు మందును ఎకరాకి 80 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకు విత్తిన ఒకటి నుంచి రెండు రోజుల్లోగా 200 లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారీ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు గోతుల పూడ్చివేత

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల్లో భాగంగా బుధవారం వివిధగ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, మంచినీటి ట్యాంక్‌ల క్లీనింగ్, వీధుల్లో గోతుల పూడ్చివేత, దోమలకు నిలయంగా ఉండే గోతులను పూడ్చే పనులు సర్పంచ్‌ల పర్యవేక్షణలో కార్యదర్శులు చేయిస్తున్నారని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు బగ్గందొరవలసలో గోతులు పూడ్చివేసే పనులు బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండాలనే సంకల్పంతో ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో స్వచ్ఛమైన నీరు, పరిసర ప్రాంతాలను శుద్ధి చేసే పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పద్మ, మనోహర్, మోహనరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గోతుల పూడ్చి వేతను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

నిరుద్యోగ యువతపై ప్రభుత్వం కక్షసాధింపు

గుమ్మలక్ష్మీపురం: మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించడంతో పాటు నిరుద్యోగులైన యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన 'ఇంటింటికీ రేషన్ పంపిణీ' వాహనాలు(ఎండీయూ వాహనాలు)ను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ద్వారా నిరుద్యోగ యువత ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురించిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, రజక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు విమర్శించారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. వలంటీర్ల వ్యవస్థను పక్కన పెట్టిందని, దీంతో ఐదేళ్లుగా సొంతూరులో ప్రజాసేవ చేస్తూ ఉపాధి పొందిన నిరుద్యోగ యువత ఏం చేయాలో తోచక అయోమయంలో పడ్డారన్నారు. అంతటితో ఆగక ఎండీయూ వాహనాలు నడుపుతూ ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేస్తూ ఉపాధి పొందుతున్న వారిని తొలగించి వారిని రోడ్డున పడేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిన సేవలను ఈ ప్రభుత్వం దూరం చేసేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దీనికి కుటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు.

రెండు బైకులు ఢీ, ముగ్గురికి గాయాలు

రాజాం సిటీ: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలు పాలయ్యారు. రాజాం మున్సిపాల్టీ పరిధి గోపాలపురం సమీపంలో కొత్తవలస గ్రామానికి చెందిన పెరుమాలి నారాయణరావు, గోపాలపురానికి చెందిన బొండపల్లి ధనుంజయ, ఆమిటి గణేష్‌లు ఎదురెదురుగా ద్విచక్రవాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడకు చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, అనంతరం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

కంద సాగు లాభదాయకం



కందుల పదం వద్ద కంద పంట

సాలూరు రూరల్: ప్రస్తుతం సాలూరు మండలంలోని 200 ఎకరాల్లో కంద సాగవుతోంది. గత ఏడాది కంటే ఈ ఏడాది సాగు తగ్గింది. మండల రైతులు పామాయిల్, మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపడంతో కంద సాగు గతం కంటే తగ్గించారు. అయితే గత ఏడాది కంద ధర టన్ను ఏకంగా 45 వేల రూపాయలు పలకడంతో సాగు చేసిన రైతులు లాభ పడ్డారు. అయితే కంద మార్కెట్లో ధర స్థిరంగా ఉండదన్న భయంతో రైతులు సాగు తగ్గిస్తున్నారు. గతంలో కందుల పదం, మామిడిపల్లి ప్రాంత రైతులు కంద ఎక్కువ సాగుచేసేవారు. ఈ ఏడాది సాగు తక్కువగా ఉండడం గత ఏడాది లాగే ధర పలికితే మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు పెంచుకోవాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని బూరాడ, సోమరాజుపేట, లక్ష్మీపురం, ఖండ్యాం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం లెర్నింగ్ ఎచీవ్‌మెంట్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థుల మానసిక సామర్థ్యాలను అంచనా వేస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు అధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు కె.అప్పలరాముడు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు, సీఆర్‌పీ కెంబూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

- రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. మండలంలో సోపేరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతంపై ఆరాతీశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యేలా, ఆసక్తి కలిగించేలా బోధన ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలుచేయాలని, వారంలో ఒకరోజు పిల్లల తల్లిదండ్రులలో ఒకరు పాఠశాలలో భోజనం చేసేలా భాగస్వామ్యం కల్పించాలని హెచ్‌ఎం అడపా వెంకటరావుకు సూచించారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

వంగర: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎం.సీతారాంపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, తరగతులు నిర్వహణ, పీఎం పోషణ వంటకాలను పరిశీలించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు, సీఆర్పీ సాకేటి శ్రీనివాసరావు ఉన్నారు.

యువకుల హల్‌చల్

- రాజాంలో రెచ్చిపోతున్న అల్లరిమూకలు
- శ్రీకాకుళం యువకుడిపై దాడి

రాజాం సిటీ: మద్యం మత్తులో రాజాం పరిసర ప్రాంతాల్లో యువకులు హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. ఈ క్రమంలోనే రాజాంలోని ఓ ఫంక్షన్‌కు వచ్చిన శ్రీకాకుళానికి చెందిన యువకుడిపై దాడిచేయడంతో ఆస్పత్రి పాలయ్యాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 25న పట్టణంలోని గొల్లవీధిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు శ్రీకాకుళం గుజరాతీపేటకు చెందిన టి.గౌతమ్, కె.గణేష్, కె.ఆదర్స్, కె.రోహిత్‌లు వచ్చారు. మధ్యాహ్నం భోజనాల అనంతరం గుజరాతీపేటకు చెందిన యువకులు గొల్లవీధికి చెందిన తన స్నేహితుడు కార్తీక్‌తో పాటు మరికొంతమంది యువకులతో కలిసి జీఎంఆర్ కాలేజీ వైపు వెళ్లి తిరిగి వస్తున్నారు. పాలకొండ రోడ్డులోని డొంకలమిల్లు వద్దకు వచ్చేసరికి అప్పటికే బార్ దగ్గర్లో మద్యం మత్తులో ఉన్న కుప్పిలి నవీన్, అతని స్నేహితులు వారితో గొడవకు దిగారు. ఈ గొడవలో గొల్లవీధి గ్రామస్తులు పారిపోగా గౌతమ్‌ను నవీన్, అతని స్నేహితులు స్కూటీపై ఎక్కించుకుని గురవాం సమీపంలోని ఓ మామిడితోటలో తీసుకువెళ్లారు. అక్కడ తాళ్లతో కట్టి కర్రలు, బెల్టుతో ముఖం, వీపుపైపు విచక్షణ రహితంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు పక్కన కూర్చున్న గౌతమ్‌ను తన స్నేహితుడు కార్తీక్ సహాయంతో రాజాం కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతకవిటి పోలీసులు తెలిపారు.

భయాందోళనలో పట్టణవాసులు

ఇదిలా ఉండగా ఈ నెల 25న రాత్రి 7 గంటల సమయంలో యువకులు సంతకవిటి రోడ్డులో కర్రలతో ఉన్నారని స్థానికులు వాపోతున్నారు. యువకులు మద్యంకి అలవాటు పడి ఇలా గుమిగూడి తిరగడంతో ఒంటరిగా వచ్చిన వారికి ఎప్పుడు ఏమౌతుందోనని భయాందోళనలు చెందుతున్నారు. గతంలో కూడా డొంకలమిల్లు జంక్షన్ వద్ద యువకులు పట్టపగలే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రాత్రి సమయంలో గురవారం, శ్రీకాకుళం రోడ్డు, సంతకవిటి రోడ్డు, బుచ్చెంపేట రోడ్డు, బొబ్బిలి రోడ్డు, చీపురుపల్లి రోడ్డులో గస్తీ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు